# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 18-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లును కేంద్రప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.**

2. **రేషన్ బియ్యం అక్రమ రవాణాపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

3. **తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా క్రీడా విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, జీఎస్టీ సవరణ బిల్లులను సభ ఆమోదించింది.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు.**

5. **తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించిన దర్శన టికెట్లను ఈనెల 23, 24 తేదీల్లో టిటిడి విడుదల చేయనుంది.**

==========================

పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో భాగంగా ఒకే దేశం ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లులను కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ నిన్న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ జరిగింది. చర్చ అనంతరం ఈ బిల్లు ప్రవేశపెట్టడంపై ప్రతిపక్ష సభ్యులు ఓటింగ్ కోరడంతో లోక్‌సభ శాసనసభాపతి ఓం బిర్లా అనుమతిచ్చారు. ప్రతిపక్షాల డిమాండ్ మేరకు జరిగిన ఓటింగ్‌లో బిల్లును ప్రవేశపెట్టేందుకు అనుకూలంగా 269 మంది, వ్యతిరేకంగా 198 మంది సభ్యులు ఓటు వేశారు. దాంతో బిల్లును మంత్రి ప్రవేశపెట్టారు. బిల్లులను తదుపరి పరిశీలన కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిక్షాలు కోరడంతో జేపీసీకి బిల్లును కేంద్రప్రభుత్వం పంపింది. కాగా ఈ బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్దతు తెలుపుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

-------------------------

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు చేరుకున్నారు. గత సాయంత్రం హకీంపేట విమానాశ్రయం వద్ద గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి ధనసరి అనసూయ సీతక్క సహా పలువురు సీనియర్ అధికారులు రాష్ట్రపతికి స్వాగతం పలికారు. ఈ నెల 21వ తేదీ వరకు సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ద్రౌపది ముర్ము బస చేస్తారు. ఈరోజు రాష్ట్రపతి నిలయంలో జరిగే వివిధ

అభివృద్ధి పనులకు రాష్ట్రపతి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఈ నెల 20వ తేదీన సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రపతి పర్యటనకు తెలంగాణ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది.

---------------------------

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. బియ్యం రవాణాపై అన్నీ అంశాలు పరిశీలించాకే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటూ...

**.....వాయిస్..... 26 సెకన్లు......**

---------------------------

తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా నిన్న మూడు బిల్లులను సభ ఆమోదించింది. క్రీడా విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. సభ్యుల నిరసనల మధ్యే ఎలాంటి చర్చ లేకుండానే ఈ మూడు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. కాగా, రాష్ట్ర పర్యాటకంపై స్వల్ప కాలిక చర్చ అనంతరం సభను శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఈరోజుకి వాయిదా వేశారు.

---------------------------

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరులోని వీఆర్ ఉన్నత పాఠశాలను ఆయన అధికారులతో కలిసి నిన్న పరిశీలించి అక్కడ కల్పించాల్సిన వసతుల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర, రాయలసీమ, విజయవాడ, గుంటూరు, నెల్లూరులలో వీటిని నెలకొల్పుతామన్నారు. ఒక్కో పాఠశాలలో రెండు వేల మంది విద్యార్థులకు ప్రవేశ ప్రవేశాలు కల్పిస్తామని తెలియజేస్తూ....

**....వాయిస్ 24 సెకన్లు....**

---------------------------

తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించిన దర్శన టికెట్లను ఈనెల 23,24 తేదీల్లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం–టిటిడి కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 19 వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై టిటిడి అధికారులతో గత రాత్రి సమీక్ష నిర్వహించారు. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తిరుపతిలో 8 కేంద్రాలు, తిరుమలలో ఒక కేంద్రంలో సర్వదర్శనం టోకెన్లు కేటాయించినట్లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజున భద్రతా సిబ్బంది సమన్వయంతో తిరుమలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాల అభివృద్ధికి, రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరులో నూతనంగా నిర్మించిన దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయాన్ని

ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, త్వరలోనే 250 వేద పండితుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. రాష్ట్రంలోని ఆలయాలకు చెందిన విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొంటూ...

**.....వాయిస్.... 38 సెకన్లు....**

---

పేదల ఇళ్లను " హైడ్రా " కూల్చివేస్తుందనే ప్రచారాన్ని నమ్మవద్దని ఆ సంస్థ కమిషనర్ రంగనాథ్ కోరారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ ఏడాది జులై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణకు కృషి చేస్తున్నామని ఆయన తెలియజేస్తూ..

**......వాయిస్ 33 సెకన్లు.....**

---

డిజిటల్, సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో సైతం ప్రధానమంత్రి డిజిటల్, సైబర్ మోసాల గురించి ప్రస్తావించారు.. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో దర్యాప్తు సంస్థలన్నీ కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. కాగా ఈ డిజిటల్ అరెస్ట్‌లపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ఒకటి, రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే కృష్ణా, బాపట్ల, ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

======================